క్లుప్తంగా

చెన్నూర్‌లో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో పోలీసులు

చెన్నూర్: పట్టణంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు, కేంద్ర బలగాలు గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ మోహన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సీఐలు వాసుదేవరావు, విద్యాసాగర్, జైపూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

భీమారం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను గురువారం తనిఖీ బృందం సభ్యులు రాజవర్ధన్, నరేందర్ తనిఖీ చేశారు. పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రికార్డులు, కూరగాయలు ఇతర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ ఫలాలు పిల్లలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనేది పరిశీలించినట్లు తెలిపారు. అధికారులు ఐలయ్య, నీలావతి, ప్రిన్సిపాల్ కనకలక్ష్మి ఉన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన మెరుగు రాయలింగు, రమా కూతురు అఖిల వివాహానికి కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు గురువారం అందించారు. రాయలింగు కరీంనగర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుడు కావడంతో అతని కూతురు వివాహానికి పుస్తెమెట్టెలు అందించినట్లు అసిస్టెంట్ మేనేజర్ రమేశ్, సూపర్‌వైజర్ సాయికృష్ణ తెలిపారు.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సీహెచ్‌వో రామూర్తి

జైపూర్: మండలంలోని టేకుమట్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో రామూర్తి, హెల్త్ ఎడ్యూకేటర్లు అల్లాడి శ్రీనివాస్, నాందేవ్ మాట్లాడుతూ విద్యార్థుల ద్వారానే సమాజానికి మంచి ఆరోగ్య సమాచారాన్ని పంపగలమన్నారు. కీటకజనిత వ్యాధుల పట్ల జనాలు ఎలా రక్షించుకోవాలో చెప్పారు. దోమల రకాలు, వాటి ద్వారా వచ్చే మలేరియా, ఫైలేరియా, చికన్ గున్యా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధుల గురించి వివరించారు. వారం రోజుల కన్నా ఎక్కువ నీరు నిలువ వుంచుకోకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ఉమారాణి, ఏఎన్‌ఎం పద్మ, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

మందమర్రిరూరల్: మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు కార్యాలయ సూపరింటెండెంట్ బాలకిషన్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి సర్ఫరాజ్ అన్నారు. గురువారం మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖండాల, ఖానాపూర్ సబ్‌సెంటర్ పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ ఇచ్చారు. ఏడుగురు గర్భిణులకు న్యూట్రీషన్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషన్ మడావి శ్రీనివాస్, ఫార్మసిస్ట్ అలం, హెల్త్ సూపర్ వైజర్‌లు వసంత, బొమ్మెత సుభాష్, ఆడే సురేశ్, కొడప యశోద, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్రపర్యటన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటన చేశారు. డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మందమర్రి మండలం బొక్కలగుట్ట గాంధారి ఖిల్లాను సందర్శించారు. అక్కడి ఆధ్యాత్మిక, చారిత్రాత్మక విశేషాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతకుముందు గాంధారి మైసమ్మను విద్యార్థులు, అధ్యాపకులు దర్శించుకుని పూజలు చేశారు. చారిత్రక విశేషాలను విద్యార్థులకు వివరించారు.

కఠిన చట్టాలు కావాలి

కెరమెరి: మహిళల రక్షణ కోసం పాటుపడే వారికే తమ మద్దతు ఉంటుందని మండలంలోని పలువురు మహిళలు పేర్కొంటున్నారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు తేవాలంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో మహిళలు, గృహిణులు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

జంగ్ తెలంగాణ

రక్షణ కల్పించే వారికే ఓటు



ప్రస్తుత తరుణంలో మహిళల రక్షణ పెద్ద సమస్యగా మారింది. మహిళా చట్టాలు ఎన్నో ఉన్నప్పటికీ అఘాయిత్యాలు ఆగడం లేదు. కఠిన చట్టాలు తీసుకొచ్చే వారికే నా ఓటు వేస్తా.

- ఆదే రుక్మాబాయి, కెరమెరి

ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి, ఆర్థికంగా ఎదగాలి. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసే వారికే మద్దతిస్తాను. మహిళలకు ప్రత్యేక హామీలు ఇవ్వాలి.

- సెండే పుష్ప, కెరమెరి

ప్రత్యేక నిధులు కేటాయించాలి



నేటి సమాజంలో విద్య అందరికీ చాలా అవసరం. కానీ గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు విద్యలో వెనుకంజలో ఉన్నారు. బాలికల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి.

- కె. సుమిత్ర, కెరమెరి

రుణాలు మంజూరు చేయాలి



బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా కొందరికి మాత్రమే రుణాలు అందుతున్నాయి. అందని వారు ఇబ్బందులు పడుతున్నారు. రుణాలు అందరికీ అందించాలి. పరిశ్రమలు స్థాపించి మహిళలకు పనులు కల్పించాలి.

- వాడై ఆశ, కెరమెరి

ప్రచారంలో కూలీలు.. పెండింగ్‌లో పనులు

- పార్టీల ప్రచారాలకు వెళ్తున్న కూలీలు
- వ్యవసాయ పనులకు తీవ్ర కొరత
- ఆందోళన చెందుతున్న రైతులు



చేనులోనే ఉన్న పత్తి

కెరమెరి: నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడింది. గత పది రోజుల నుంచి వివిధ పార్టీల అభ్యర్థుల తరుపున ర్యాలీలు, సభలు, రోడ్‌షోలకు కూలీలను తరలిస్తుండడంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడుతుంది. ప్రస్తుతం పొలాల్లో పత్తితీత పనులు చేయాల్సి ఉంది. కాగా ప్రచారానికి రెండు గంటలు వెళ్తే రూ. 200 నుంచి రూ. 400 వరకు ఇస్తున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, మగవారికైతే మద్యం కూడా దొరుకుతుండడంతో కూలీలు వ్యవసాయ పనులవైపు ఆసక్తి చూపడం లేదు.

రోడ్ షోలు.. ఇంటింటా ప్రచారాలు..

ప్రధాన పార్టీల నాయకులు జన సమీకరణ చేసి వారిని ప్రచారానికి తీసుకెళ్తున్నారు. కూలీలు కూడా పార్టీలతో సంబంధం లేకుండా ఎవరు పిలిచినా ప్రచారానికి వెళ్తున్నారు. ఇక ప్రచారాలు మొదలైన తర్వాత రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాల కారణంగా కూలీలకు డిమాండ్ మరింత పెరిగింది. ఉదయం నుంచి సాయంకాలం వరకు ఎండలో వ్యవసాయ పనులకు వెళ్లడం కంటే కూలీలు గ్రామాల్లో పార్టీల ప్రచారానికి వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలో ప్రతీరోజు వేలాది మంది కూలీలు ఏదో ఒక పార్టీ తరఫున ప్రచారానికి వెళ్తుండడంతో చేసేది ఏమి లేక రైతులే వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు.

దళారుల దందా..

ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి చోటా, మోటా నాయకులు, దళారులు పండుగ చేసుకుంటున్నారు. కొందరు మహిళా దళారులు మహిళా కూలీలతో ఒప్పందాలు చేసుకొని వారిని ఆటోలో, ట్రాక్టర్‌లో ప్రచారానికి తీసుకెళ్తున్నారు. అభ్యర్థుల వద్ద నుంచి రూ. 400 నుంచి రూ.600 వరకు వసూలు చేసి కూలీలకు మాత్రం రూ. 300 నుంచి రూ. 400లోపు ఇచ్చి సర్ది చెబుతున్నారు. ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్, వాంకిడి, తిర్యాణి, నార్నూర్ తదితర మండలాల పార్టీ కార్యాలయాల ఎదుట కూలీలు క్యూ కడుతున్నారు. ప్రచారానికి 10 మందిని రమ్మంటే 50 మంది వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వారికి డబ్బులు ముట్టజెప్పే అభ్యర్థులు కష్టాలపాలవుతున్నారు. కొన్ని చోట్ల డబ్బులు పంచే విషయంలో నాయకుల మధ్య బేధాభిప్రాయాలు వచ్చి గొడవలు పడుతున్నట్లు సమాచారం. ఈ నెల 30న జరిగే పోలింగ్ జరిగే వరకు పొలం పనులకు కూలీలు దొరికే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూలీలకు భారీ డిమాండ్



ఎన్నికల సీజన్ కావడంతో కూలీలకు భారీ డిమాండ్ పెరిగింది. ఓవైపు పత్తి తీసే సమయం, మరోవైపు ఎన్నికల ప్రచారం ఒకేసారి రావడంతో కూలీలు దొరకడం లేదు. దినసరి కూలీ రూ.200 నుంచి 400 అడుతున్నారు.

- చహకటి దాము, రైతు, నిసాని

సోయా పంట.. దిగుబడి తంటా!

- తగ్గిన దిగుబడి
- సాగుకు ఆసక్తి చూపని రైతులు
- మద్దతు ధర లేక ఇళ్లలోనే నిల్వ
- జిల్లాలో 1,524 ఎకరాల్లో సాగు



కుప్పలుగా పోసిన సోయా

కౌటాల: సక్రమంగా వర్షాలు లేక సోయా పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. జిల్లాలో రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో 1524 ఎకరాల్లో సోయా పంట సాగు చేశారు. అప్పులు చేసి మరీ పంటలు వేసిన చిన్న, సన్నకారు రైతులు పంట దిగుబడి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన పంట వడ్డీలకు కూడా సరిపోని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని సోయా రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం..

జిల్లాలోని రైతులు సోయాబీన్ పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపించడం లేదు. గత సంవత్సరం సోయా పంటకు మద్దతు ధర తక్కువగా ఉండటంతో ఈసారి రైతులు సోయా పంటను ఎక్కువగా సాగు చేయలేదు. సోయా పంట గతేడాది 9,186 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది కేవలం 1524 ఎకరాల్లోనే సాగు చేశారు. గతంలో ప్రధాన పంటగా వేల ఎకరాల్లో సోయా పంట సాగు చేసే రైతులు పంటకు మద్దతు ధర లేకపోవడంతో సాగుకు మొగ్గు చూపలేదు. ఒక్కో ఎకరానికి విత్తనం నుంచి పంటకోసే వరకు రూ. 25 వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు.

పంట డబ్బులు కోతకే..

మూడు నెలల పాటు కష్టపడి పండించిన సోయా పంట రైతులను నట్టేట ముంచింది. ఇటీవల పంట కోతలు పూర్తి కాగా ప్రస్తుతం పంట నూర్పిడి చేస్తున్నారు. పంట దిగుబడి పూర్తిగా పడిపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఒక్కో ఎకరానికి కేవలం రెండు క్వింటాలు సోయా మాత్రమే దిగుబడి వస్తుంది. ప్రభుత్వం ఈ ఏడాది సోయా పంటను రూ. 4,600 మద్దతు ధర ప్రకటించింది. కానీ దళారులు రైతుల నుంచి క్వింటాలుకు రూ. 3వేల వరకు ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లేక సోయాబీన్ ఇళ్లలోనే నిల్వ ఉంచుతున్నారు. ఒక ఎకరం సోయా కోయడానికి, విత్తనాలు పట్టించడానికి రూ. 4 వేల నుంచి రూ.5 వేల వరకు కూలీల ఖర్చు వస్తోంది. దీంతో వచ్చిన సోయా పంట పూర్తిగా అక్కడికక్కడే లెక్కతేలిపోతుంది. దీంతో సోయా పంట డబ్బు ఒక్క రూపాయి కూడా రైతుల ఇంట్లోకి వచ్చే పరిస్థితి లేదు.

ఖర్చు ఎక్కువ దిగుబడి తక్కువ

రైతులు గతంలో 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు సోయా పంట దిగుబడి సాధించేవారు. కానీ ప్రస్తుతం పంట రెండు క్వింటాళ్లు కూడా రావడంలేదు. ధర లేకపోవడంతో ఇళ్లలోనే సోయాబీన్ పంటను నిల్వ ఉంచుతున్న రైతులు మద్దతు ధర వచ్చినప్పుడే విక్రయిస్తామని చెబుతున్నారు. కాగా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి తగ్గింది

నేను రెండు ఎకరాల్లో సోయా పంట వేశాను. ఇటీవల సోయా పంట కోత పూర్తి చేసి పంటను పట్టించాను. రెండు ఎకరాలకు ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదు. ఈసారి సోయా పంట దిగుబడి పూర్తిగా పడిపోయింది. మద్దతు ధర లేక సోయా పంటను ఇంట్లోనే నిల్వ ఉంచాను. ప్రభుత్వం సోయా పంటకు రూ. 10 వేలు మద్దతు ధర ప్రకటించాలి.

- కె.ఆనంద్‌రావు, యాపలగూడ

భక్తిశ్రద్ధలతో ప్రబోధిని ఏకాదశి



హారతులిస్తున్న మహిళలు



రావి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయంలో గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రబోధిని ఏకాదశి జరుపుకున్నారు. తెల్లవారుజామునే మహిళలు తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి శివాలయానికి చేరుకున్నారు. శివుడికి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం భజనలు చేశారు. రావిచెట్టుకు పూజలు చేసి ప్రదక్షిణలు చేశారు.

అయ్యప్ప భక్తుల మాలధారణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ హరిహర అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం భక్తులు అయ్యప్పస్వామి మాలధారణ స్వీకరించి మండల దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాములకు ఆలయ అర్చకులు నాగేశ్వర్ భక్తులకు మాలధారణ చేశారు. మొదట ఆలయంలో స్వామివారికి అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు ఖాండ్రె కిషన్, గురుస్వాములు మడావి శ్రీనివాస్, కన్నె, కత్తి, గంట స్వాములు పాల్గొన్నారు.

నేడు అస్సాం సీఎం పర్యటన

కాగజ్‌నగర్‌రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని నజ్రుల్‌నగర్‌కు అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిశ్వశర్మతో పాటు కేంద్రమంత్రి శాంతన్ ఠాగూర్ రానున్నట్లు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగసభలో వారు పాల్గొంటారన్నారు.

రేపు కాగజ్‌నగర్‌లో రామరాజ్య స్థాపన సంకల్ప సభ

కాగజ్‌నగర్‌టౌన్: ఎస్పీఎం గ్రౌండ్‌లో ఈ నెల 25న రామరాజ్య స్థాపన సంకల్ప సభ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి హరీశ్‌బాబు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర వణి నియోజకవర్గ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, మధ్యప్రదేశ్ ఎంపీ అశుతోష్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయశ్రీ అవార్డుకు సుధీర్‌కుమార్ ఎంపిక

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్ న్యాయశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. న్యాయవ్యవస్థలో చేస్తున్న అత్యున్నత సేవలకు మదర్ ఫౌండేషన్, మేఘాసిటీ నావ కళా వేదిక సంయుక్తంగా ఈఅవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈనెల 25న హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో హైకోర్టు న్యాయమూర్తి సురేపెల్లి నంద, సరస్వతి పుత్రులు దైవజ్ఞశర్మ, భీంరావు యశ్వంత్ అంబేద్కర్ చేతుల మీదుగా అవార్డును అందుకొనున్నారు.

బీమా పథకాలతో ధీమా



బీమాచెక్కు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

కౌటాల: ప్రతీ ఒక్కరు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. గురువారం లబ్ధిదారులకు బీమా చెక్కులు అందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల సాధారణ మృతి చెందిన మూడు బాధిత కుటుంబాలకు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన నగదును రూ. 2 లక్షల చొప్పున చెక్కులు అందించారు. ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మనోహర్, రాజేశ్, భాస్కర్, సీసీలు కుసుమ, రాజమణి, శంకర్, మోరేశ్వర్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



స్వాధీనం చేసుకున్న బాటిళ్లు

దహెగాం: ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. గురువారం మండలంలోని చినరాస్పెల్లి గ్రామంలో రావుల రాకేశ్ ఇంట్లో తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం లభించిందన్నారు. నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సై కిషన్, సిబ్బంది స్వాతి, కుమార్, రవి, హుస్సేన్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై హామీ ఇవ్వాలి

శ్రీరాంపూర్: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిర్దిష్టమైన హామీలు ఇవ్వాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై కాంట్రాక్ట్ కార్మికులతో గురువారం సమావేశమై వారి సమస్యలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ మేనిఫెస్టోను ప్రకటించాయన్నారు. అందులో సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన ఏ ఒక్క సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వలేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు సమ్మయ్య, సంపత్, సురేశ్, సన్నీ, రమేశ్ పాల్గొన్నారు.

యువతి వివాహానికి చేయూత

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన అక్షిత అనే యువతి వివాహానికి మంత్రి ఐకేరెడ్డి వ్యక్తిగత సహాయకులు ఒడ్డెపల్లి కృష్ణంరాజు చేయుతనిచ్చారు. గురువారం వారి ఇంటికి వెళ్లి తమ వంతుగా రూ. 20వేల విలువైన పసుపు, కుంకుమతోపాటు పుస్తె,మట్టెలు అందజేశారు. కార్యక్రమంలో ఓకేఆర్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

కుంటాల: ప్రతి పౌరుడు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. గురువారం కల్లూర్-కుంటాల రహదారిపై వెంకూర్ వద్ద ప్రయాణికులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కించపరిచే మెసేజ్‌లు పెడితే చర్యలు

బెల్లంపల్లి: సోషల్ మీడియా వేదికగా కించపరిచే మెసేజ్‌లు పెడితే చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ ఒకప్రకటనలో హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని రాజకీయ పార్టీని కాని ప్రజాప్రతినిధులు లేదా ఎవరైన సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టులు, కించపరిచే మెసెజ్‌లు పెట్టిన వ్యక్తులు, గ్రూప్ అడ్మిన్లపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణకు కృషి

మంచిర్యాలక్రైం: ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్నేహ స్వచ్ఛంద సంస్థ అర్గనైజర్ (ఎన్‌జీవో) ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేందర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఘనంగా సత్యసాయి జన్మదిన వేడుకలు



కుంచవెల్లిలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు



ధ్యానం చేస్తున్న భక్తులు

దహెగాం: మండలంలోని కుంచవెల్లి గ్రామంలో గల శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కేక్ కట్ చేసి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి బాబా భక్తులు మహేశ్, స్వామి, లక్ష్మీనారాయణ, సత్యన్న, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 98వ జన్మదిన వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలోని గుండి రహదారి సమీపాన గల సత్యసాయి సేవాసదన్‌లో అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సేవాసదనంలో ఉదయం 5గంటల నుంచి రాత్రి వరకు వివిధ రకాల పూజలు, హోమం చేపట్టారు. అనంతరం ప్రసాద వితరణ వేడుకల్లో సేవాసదన్ ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్, తాటిపల్లి, గురుడుపేట్ గ్రామాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 98వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పల్లకి ఊరేగించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం చేపట్టారు. ఎంపీటీసీ సభ్యులు బొమ్మకంటి మనీష్, కమిటీ సభ్యులు మణిరాం, దిలీప్, భగీరథ్, విలాస్, అనిల్, బాజీరావు, మహేశ్, వాను పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్థిర ప్రతిష్టాపన కార్యక్రమం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌లో అలివేలు మంగసామెత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ స్థిర ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గౌతమ్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, అప్పాల ప్రభాకర్, నాలం శ్రీనివాస్, పుదరి సాయికృష్ణ, జగడం రాజు, కౌన్సిలర్ నేరెళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్ల కోసం 21 మంది తరలింపు

ఖానాపూర్: పట్టణంలో దేవి ఐకేర్‌లో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం 21 మందిని ఆర్మూర్‌లోని ఆస్పత్రికి కంటి ఆపరేషన్ కోసం తరలించామని నేత్ర వైద్య సహాయ నిపుణులు నిఖిల్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

కుంటాల: మండల కేంద్రంలోని 12వ వార్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడిన విషయం తెలిసిందే. దీనిపై ఈనెల22న సాక్షిలో వృథాగా భగీరథ జలం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి భగీరథ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సిబ్బంది పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించారు.